మా వాడే.. బిల్లులు చేసెెయ్!

- మంత్రి పేషీ నుంచి ఫోన్లు
- కాంట్రాక్టర్ల పెండింగ్ ఫైళ్లకు రెక్కలు
- 60 రోజుల్లో రూ.2 కోట్ల బిల్లులు క్లియరెన్స్
- సిఫార్సు లేని రూ.15 కోట్ల బిల్లులు మాత్రం పెండింగ్
- అప్పులు చేసి పనులు చేసినా బిల్లుల కోసం కొందరి ఎదురుచూపులు



కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): హలో.. కమిషనర్ గారు.. అతను మా వాడే. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంట కదా.. వెంటనే క్లియర్ చేయండి. ఫోన్‌కాల్ రావడం ఆలస్యం ఒక కాంట్రాక్టర్‌కు రూ.29 లక్షలు, మరో కాంట్రాక్టర్‌కు రూ.60 లక్షలు బిల్లులు యుద్ధప్రాతిపదికన క్లియర్ చేశారు. ఇలా ఓ మంత్రి పేషీ నుంచి ఫోన్లు రావడంతో పెండింగ్ బిల్లులకు రెక్కలు వచ్చేశాయి. అయితే కొంత మంది బిల్లులు క్లియర్ కావడం, మరి కొంత మందివి క్లియర్ చేయకపోవడంతో పలువురు మున్సిపల్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పనులు చేశాం కదా.. ఎందుకంత వివక్ష అని వాపోతున్నారు.

– ఏడాది క్రితం ఓ కాంట్రాక్టర్ నగరంలోని వాటర్ వర్క్స్‌లో పనులు చేశారు. బిల్లులు రూ.15 లక్షలు రావాల్సి ఉంది. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా బిల్లులు మాత్రం కాలేదు. కొందరివి పాస్ ఆన్ అయినా బిల్లులు పెండింగ్‌లో ఉంటే.. మరికొంత మంది కాంట్రాక్టర్లవి మాత్రం సీఎఫ్ ఎంఎస్ (కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)తో సంబంధం లేకుండా, సంబంధిత కాంట్రాక్టర్ వేలిముద్ర లేకుండా క్లియర్ అవుతున్నాయి. దీంతో అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎంత అధికారంలో ఉన్నా వారికి, తమకు సమన్యాయం చేయాలన్న ఆవేదనను పలువురు కాంట్రాక్టర్లు బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను కాదని, ఆరు నెలల క్రితం అధికార పార్టీకి చెందిన వారితో ఫోన్లు చేయించుకొని మరీ బిల్లులు చేసుకోవడంపై సర్వాత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మతలబు ఏంటో.. అన్న అభిప్రాయం వినిపిస్తోంది.

రెండు నెలల్లో రూ.2 కోట్ల బిల్లుల క్లియరెన్స్

గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లాకు చెందిన మంత్రి పేషీ నుంచి ఇలా ఫోన్ రావడం, అలా బిల్లులు క్లియర్ కావడం జరుగుతోంది. గత రెండు నెలల్లో కర్నూలు కార్పొరేషన్‌లో రూ.2 కోట్ల బిల్లులు క్లియరెన్స్ అయ్యాయి. సిఫార్సులు ఉంటేనే బిల్లుల క్లియరెన్స్ జరుగుతోందన్న అభిప్రాయాన్ని పలువురు కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత ఏడాదిలో పలువురు మున్సిపల్ కాంట్రాక్టర్లు నగరపాలక పరిధిలోని వాటర్ వర్క్స్‌తో పాటు వివిధ కాలనీలలో మురుగుదొడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు వంటి పనులు చేపట్టారు. టెండర్ దక్కించుకొని అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల మంజూరులో అనవసర జాప్యం చేస్తున్నారు. పనులు చేసి రికార్డు చేసి గత ఐఏఎస్ అధికారి నుంచి పాస్‌ఆన్ అయినా చెక్కులు సిద్ధం చేయడం లేదు. దీనిపై విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నుంచి ఫోన్లు వచ్చిన వారికే డ్రాయింగ్ బ్రాంచ్ నుంచి ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల నుంచి ఫైల్ స్పీడ్‌గా కదులుతోంది. ఉన్నతాధికారి సైతం బిల్లులపై సంతకాలు చేయడం, అకౌంట్స్ సెక్షన్‌లో చెక్కులు మంజూరు చేస్తున్నారు. సందట్లో సడేమియా అన్న చందంగా అధికార పార్టీకి చెందిన కొంతమంది చోటా మోటా నాయకులు తెరపైకి వచ్చారు. బేరాలు కుదుర్చుకొని బిల్లులు క్లియర్ చేస్తున్నారు. డ్రాయింగ్ బ్రాంచ్‌లో పర్సంటేజీలు, అకౌంట్స్ సెక్షన్‌లో పర్సంటేజీలు చురుగ్గా సాగుతున్నాయి. క్లియరెన్స్ చేసుకోవడం షరా మామూలుగా సాగిపోతోంది.

సిఫార్సు లేక పెండింగ్‌లో రూ.15 కోట్ల బిల్లులు

సిఫార్సు లేకుంటే ఎక్కడి ఫైల్ అక్కడే.. ఎక్కడి బిల్లు అక్కడే అన్న చందంగా నగర పాలకలో తయారైంది. ఏడాది క్రితం పనులు చేసిన సుమారు 30 నుంచి 40 మంది కాంట్రాక్టర్లకు రూ.15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు సీఎఫ్ఎంఎస్ సైతం నోచుకోలేదు. దీంతో ఎప్పుడు బిల్లులు క్లియర్ అవుతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమన్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. వారికి రూ.10 లక్షలు క్లియర్ చేస్తే తమకు కనీసం రూ.5 లక్షలు ఇలా.. క్లియర్ చేసుకుంటూ పోతే తమకు ఆర్థిక ఇబ్బందులు, అప్పుల తిప్పలు ఉండవు కదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక ఉన్నతాధికారులు పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లుల విషయంలో ఏకపక్షంగా ఉండకుండా పెండింగ్‌లో ఉన్న అందరి బిల్లులు 50 శాతం క్లియర్ చేయాలని కోరుతున్నారు.

నేడు సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో భగవద్గీత సహస్ర గళ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ పేర్కొన్నారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు వెయ్యి మందితో భగవద్గీత పారాయణం ఉంటుందని పేర్కొన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఇస్కాన్‌లో: కర్నూలు ఇస్కాన్ జగన్నాథ మందిరంలో బుధవారం గీతా జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు గీతా తులాభారం, 12 గంటలకు రాజ భోగ హారతి, ప్రత్యేక ప్రవచనం, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి గీత యజ్ఞం సంపూర్ణ గీత పారాయణం ఉంటుందని తెలిపారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

క్లుప్తంగా

సభ్యత నమోదు


సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న ఆర్.నరసింహులు

కర్నూలు(సెంట్రల్): సీఐటీయూ న్యూసిటీ ఆటో యూనియన్ నగర కమిటీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని సీక్యాంపు సెంటర్‌లో సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లకు సంఘం సభ్యత్వాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఏ క్షణమైనా సమస్యలను తెలిపితే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బి.రాధాకృష్ణ, చంద్రశేఖర్, మధు, జయరాముడు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదికి సన్మానం


న్యాయవాది జి.నాగశేషయ్యను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఫోర్టు సభ్యులు

కర్నూలు: అవసరమైన వారికి ఉచితంగా న్యాయ సేవలందిస్తున్న సీనియర్ న్యాయవాది జి.నాగశేషయ్యను కర్నూలు లయన్స్ క్లబ్ ఫోర్టు కర్నూలు రీజియన్ మంగళవారం ఘనంగా సన్మానించింది. స్థానిక ఆర్‌ఆర్ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఫోర్టు రీజియన్ సమావేశం క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు సేవలందించడం లయన్స్ క్లబ్ ఫోర్టు ముఖ్య ఉద్దేశమని, అలాగే సేవలందించే వారిని క్లబ్ గుర్తించి ప్రాధాన్యత ఇస్తుందని డాక్టర్ బాలమద్దయ్య పేర్కొన్నారు. క్లబ్ కర్నూలు రీజియన్ చైర్మన్ డాక్టర్ రాహుల్, జోనల్ చైర్మన్ ప్రభాకర్, అధ్యక్షుడు కె.శ్రీధర్, నాయకులు రామరాజు, వెంకటేశ్వర్లు, పాండు రంగారెడ్డి, రాజ్‌కుమార్, ఏసుదాసు పాల్గొన్నారు.

ఇంటిని తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): దేవనకొండ మండలం చెల్లిచెలిమెల గ్రామంలో మాదిగ సంజన్న ఇంటిపై పెట్రోలు పోసి తగలబెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు రాచపూడి ఆనంద్, సుభాష్‌చంద్రబోస్, విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటిని తగలబెట్టిన ఘటనలో 25 మందిపై కేసు నమోదు చేసినా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు.

ఆర్‌యూలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు


క్యాండిల్ లైటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ముందస్తు క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు అందించిన ప్రేమ, శాంతి సందేశాలు మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమానికి ఎల్లంకి ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పులిపాటి జాన్‌పాల్ ప్రధాన వక్తగా హాజరై సందేశమిచ్చారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడుతో పాటు వివిధ శాఖల ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రశాంతత అవసరం


సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులతో వీఎస్ఆర్ మూర్తి

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వీఎస్ఆర్ మూర్తి అన్నారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని సాయి మందిరాన్ని సందర్శించిన ఆయన సందేశమిచ్చారు. సత్యసాయి బాబాతో ఉన్న అనుబంధాన్ని సాయి సేవకులతో పంచుకున్నారు. తన ఆధ్యాత్మిక ప్రసంగాలను మెచ్చి పుట్టపర్తి సాయిబాబా తనకు ఆధ్యాత్మిక శాస్త్రవేత్త అనే బిరుదును ప్రదానం చేశారని గుర్తు చేసుకున్నారు. సాయి బోధనలను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

విజయవాడకు రైలు నడపాలి


మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ రైలును నడపాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆది, సోమవారాల్లో సీపీఎం ఓల్డ్‌సిటీ నగర కమిటీ మహాసభలు జరిగాయి. సమావేశంలో చేసిన తీర్మానాలపై మంగళవారం ఓల్డ్‌సిటీ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. మూడోసారి అధికా రంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఏపీపై తీవ్ర వివక్ష చూపుతోందన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ మిత్రపక్ష ప్రభుత్వం ఉన్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, వాటాలను సాధించడంలో విఫలమైందని విమర్శించారు. కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ మీదుగా వెళ్తున్న విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును కర్నూలు మీదుగా నడపాలన్నారు. అలాగే కాచిగూడ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు కర్నూలు మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం విజయవాడకు రైలులో వెళ్లే అవకాశం లేకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ చట్ట సవరణను టీడీపీ, జనసేన వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్ ఆస్తుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలన్నారు. నగర కార్యవర్గ సభ్యులు ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు జాప్యం చేయొద్దు


డీఈఓ శ్యాముల్ పాల్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించి మెడికల్ బిల్లులు చేయడంలో డీఈఓ ఆఫీస్‌లో జాప్యం జరుగుతోందని, అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు డీఈఓ ఎస్.శ్యాముల్ పాల్‌ను కలిసి విన్నవించారు. ఇటీవలే ఎన్నికైన పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం మంగళవారం డీఈఓను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి కృష్ణారెడ్డి, ఎం.ధనుంజయ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో, వేసవి సెలవుల్లో పని చేసిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవుల నమోదుకు ఉత్తర్వులు మంజూరు చేయాలని డీఈఓను కోరారు. ఈ ఏడాది మార్చి పదో తరగతి మూల్యాంకనంలో కొంతమంది ఉపాధ్యాయులకు రావాలిసిన పారితోషికం వెంటనే అందించాలని కోరారు. ఆ సంఘం నాయకులు బాబురావు, శ్రీనివాసరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి


రక్తదాతకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రాణదానంతో సమానమైన రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ పిలుపునిచ్చారు. స్థానిక కర్నూలు బ్లడ్ సెంటర్‌లో అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తలసీమియా బాధిత చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సంద్బంగా ఆయన మాట్లాడుతూ.. తలసీమియా బాధిత చిన్నారులకు తరచూ రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని, వారి ఆవశ్యకతను గుర్తించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంపై అపోహలను వీడి ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ రవికాంత్, అక్షయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మణిబాబు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


వేదావతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి

ఆలూరు రూరల్/ఆలూరు: వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి శెట్టి, జిల్లా కమిటీ సభ్యుడు భూపేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 2024–25 బడ్జెట్‌లో వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి 8 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. హాలహర్వి మండలం బిలేహాల్ గ్రామ సమీపంలో పనులు ఆగిపోయాయని వాటిని తిరిగి ప్రారంభించాలన్నారు. రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మికాంత్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, రంగన్న నాయకులు సిద్దప్ప, రాముడు, వన్నూర్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. మండల పరిధిలోని పూడూరు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ వెంకటలక్ష్మి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జేసీ హాజరయ్యారు. రైతుల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు. గ్రామంలో 223 డి.సర్వే నంబర్‌లో గతంలో అసైన్డ్ భూమి పట్టాలు ఇచ్చారని, ఇంతవరకు భూమి చూపలేదని కొందరు బాధితులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా తమకు భూములు చూపించాలని కోరుతూ సవరన్న, బిసన్న వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన జేసీ రికార్డులు పరిశీలించి భూమి హద్దులు చూపించాలని సర్వేయర్‌ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో అందజేసిన ప్రతి వినతికి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని అధికారులను జేసీ ఆదేశించారు. 15 మంది రైతులు వివిధ సమస్యలపై వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు.

కల్లూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లై డివిజనల్ మేనేజర్, మండల నోడల్ ఆఫీసర్ నాగసుధ సూచించారు. మండల పరిధిలోని పర్ల గ్రామంలో మంగళవారం తహసీల్దార్ ఆంజనేయులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. 66 మంది అర్జీలు అందజేశారని తహసీల్దార్ చెప్పారు. సర్పంచ్ హనుమక్క, ఎంపీటీసీ శేషన్న, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

నేడు 'శౌర్య దివస్' బైక్ ర్యాలీ

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు శౌర్య దివస్ భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఓల్డ్ బస్టాండ్‌లోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల నుంచి వినాయక ఘాట్ వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ సామూహిక హారతి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గీతా జయంతిని పురస్కరించుకొని ప్రతి ఆలయంలో హైందవ శంఖారావం విషయాన్ని తెలియజేస్తూ రాత్రి 7 నుంచి 8 గంటల వరకు సామూహిక హారతి నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా పోరాటాల నిర్వహణకు విరాళాలు

కర్నూలు(సెంట్రల్): ప్రజా పోరాటాలకు వినియోగించేందుకే విరాళాలు సేకరిస్తున్నట్లు సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో అరుంధతీనగర్, ధనలక్ష్మీనగర్‌లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి విరాళాలను సేకరించారు. నాయకులు భద్రకుమార్, నల్లన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కర్నూలు(సెంట్రల్): నంద్యాల -నందిపల్లె మధ్యలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించినట్లు నంద్యాల రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. సోమవారం రాత్రి యువకుడు రైలు నుంచి కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు తెలుపు, పసుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీషర్టు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని కోరారు.

అయ్యప్పస్వామికి వెండి కవచం బహూకరణ


వెండి కవచాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దాత

పత్తికొండ(తుగ్గలి): పట్టణంలోని తేరుబజారులో కొలువైన అయప్పస్వామికి స్థానిక భక్తుడు వెండి కవచాన్ని బహూకరించాడు. పట్టణానికి చెందిన కుర్వ బ్రహ్మయ్య రూ.3 లక్షలు విలువ చేసే వెండి కవచాన్ని తయారు చేయించి మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వెళ్లి అందజేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాలధారులు దాతను సన్మానించారు.

స్మార్ట్‌గా కాలక్షేపం


ఈ ఫొటోలో దర్జాగా స్మార్ట్ ఫోన్‌లో పాత ఎన్‌టీఆర్ సినిమా చూస్తున్న వ్యక్తి పేరు గోపాల్. ఇతనిది కర్నూలు జిల్లా గూడూరు. పగలంతా కర్నూలులో భిక్షాటన చేసి చీకటి పడగానే సర్వజన వైద్యశాలకు చేరుకుంటాడు. ఓపీ భవనం ఎదురుగా ఉన్న మెడికల్ షాపు వద్ద రాత్రి పూట నిద్రిస్తాడు. విశ్రాంతి సమయంలో సెల్‌ఫోన్‌లో పాత సినిమాలు, రీల్స్ చూస్తూ కాలక్షేపం చేస్తాడు. తనతో మాట్లాడేందుకు ఫోన్‌ను తన కుమారుడు ఇప్పించాడని గోపాల్ చెప్పాడు. డబ్బున్న వారికే కాదు. ప్రతిఒక్కరికీ స్మార్ట్ ఫోన్ చేరువైందని ఈ చిత్రం ద్వారా తెలుస్తోంది.

– కర్నూలు హాస్పిటల్

వైద్య విద్యార్థుల ప్రతిభ


డాక్టర్ మంజులాబాయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్లాస్టిక్ సర్జరీ విభాగం పీజీ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ నెల 6వ తేదీన కాకినాడలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల 21వ వార్షిక కాన్ఫరెన్స్ (అప్రస్కాన్) నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కర్నూలు మెడికల్ కాలేజీ ప్లాస్టిక్ సర్జరీ విభాగం నుంచి గెస్ట్ లెక్చరర్‌గా హెచ్‌ఓడీ డాక్టర్ మంజులాబాయి హాజరయ్యారు. పీజీ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. వీరిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం డాక్టర్ మంజులాబాయి కర్నూలులో మాట్లాడుతూ.. స్కిన్ బ్యాంక్ ఏర్పాటుకు కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి ఏర్పాట్లు చేసుకోవాలని డీఎంఈ డాక్టర్ నరసింహులు సూచించారని తెలిపారు. గెస్ట్ లెక్చర్‌లో అరుదైన కేసులను ఎంచుకుని చక్కగా ప్రజెంటేషన్ ఇచ్చారని అభినందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అభినందించారు.

నులి పురుగులను నివారించాలి

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో నులిపురుగులు ఏర్పడకుండా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు నులిపురుగులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. నులిపురుగులు రక్తహీనతకు దారి తీస్తాయని, శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయని చెప్పారు. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగజేస్తాయన్నారు. దీనివల్ల పిల్లల్లో ఆకలి ఉండదని, నీరసపడిపోతారని, వ్యాధినిరోధక శక్తి తగ్గుతుందని, వాంతులు, విరేచనాలు, మలంలో రక్తం పడటం వంటి సమస్యలు ఏర్పడతాయని వివరించారు. వ్యక్తిగత శుభ్రత లేకపోవడం వల్లే ఎక్కువగా నులిపురుగులు వ్యాపిస్తాయన్నారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. కిశోర బాలికలకు పౌష్టికాహారం, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు షకీలా, మంజులత, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త రాములమ్మ, ఆశా కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

జన్యుశాస్త్ర పాత్ర కీలకం


సంచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మస్తానయ్య

కర్నూలు సిటీ: మానవ సమాజ నిర్మాణంలో జన్యుశాస్త్ర పాత్ర ప్రత్యేకమైందని, దీన్ని విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని రెసిడెన్షియల్ స్కూళ్ల సొసైటీ కార్యదర్శి మస్తానయ్య అన్నారు. మంగళవారం సాంస్కృతిక శాఖ, హైదరాబాదు వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఎగ్జిబిషన్ వాహనాన్ని డీఈఓ ఆఫీస్ ఆవరణలో ఆయన ప్రారంభించి ప్రసంగించారు. జన్యువుల నిర్మాణం, జన్యువుల సమస్యలు, జన్యు రుగ్మతలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు తదితర అంశాలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసిన స్లైడ్‌లను సంచార వాహనంలో ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు జన్యుశాస్త్రంపై అవగాహన పెరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో సంచార వాహనం తిరుగుతుందని, విద్యార్థులు ఈ వాహనాన్ని సందర్శించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఈఓ ఎస్.శ్యాముల్ పాల్, డీఈఓ ఆఫీస్ ఏడీలు నాగభూషణం, శ్రీనివాసులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2.01 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్

పత్తికొండ(తుగ్గలి) : డివిజన్‌లో 120కిలో మీటర్ల మేర రోడ్ల మరమ్మతుల కోసం రూ.2.01 కోట్లు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్యాపిలి-పత్తికొండ రోడ్డులో 6కిలోమీటర్ల రూ.15లక్షలు, తుగ్గలి-నంచర్ల 7 కిలోమీటర్లకు రూ.7లక్షలు, గుత్తి-పత్తికొండ 9 కిలోమీటర్లకు రూ.13లక్షలు, పత్తికొండ బైపాస్ రోడ్డులో 3.86 కిలోమీటర్లకు రూ.5లక్షలు, మద్దికెర- పత్తికొండ-దేవనకొండ రోడ్డుకు 10 కిలోమీటర్లకు రూ.25లక్షలు మంజూరయ్యాయన్నారు. గుంతకల్లు-పత్తికొండ 20కిలోమీటర్లకు రూ.40లక్షలు, ఆలూరు-ఆస్పరి- జొహరాపురం రోడ్డుకు 10 కిలోమీటర్లకు రూ.20లక్షలు, కరివేముల-ఆరేకల్లు రోడ్డుకు 22 కిలోమీటర్లకు రూ.40లక్షలు, కర్నూలు-బళ్లారి రోడ్డు 20 కిలోమీటర్లకు రూ.18 లక్షలు, గుత్తి-ఆదోని రోడ్డుకు 12 కిలోమీటర్లకు రూ.18లక్షలు చొప్పున కేటాయించారన్నారు. ఇప్పటికే 70శాతం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సంక్రాంతిలోపు రోడ్లపై గుంతలన్నీ మరమ్మతులు చేస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన

- రెండవ రోజు సమ్మెలో పాల్గొన్న కార్మికులు
- నగరంలో ర్యాలీ


కార్మికుల నుద్దేశించి మాట్లాడుతున్న జ్ఞానమ్మ

కర్నూలు (టౌన్): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జానమ్మ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్ వాటర్ వర్క్స్ నుంచి కలెక్టరేట్ వరకు, అలాగే అక్కడి నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి వాటర్ లైన్‌మెన్లు, ఫిట్టర్లు, లీకేజీ మెకానిక్స్, పంప్ ఆపరేటర్స్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు, వెల్ మెకానిక్‌లు ఇలా 300 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. తమ సమస్యలపై ఎన్నో సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, కనీస పెన్షన్ కింద రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అనారోగ్య కారణాలతో పనిచేయలేని కార్మికుడి కుటుంబంలో మరో వ్యక్తికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, యూనిఫాం, రక్షణ పనిముట్లు అందజేయాలన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రమేష్, మనోహర్, వెంకటేశ్వర్లు, యాసిన్ బేగ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.